చిన్నారి అస్పియా మృతదేహం లభ్యం

- శోకసంద్రంలో పట్టణ ప్రజలు
- మూడు రోజుల ఉత్కంఠకు తెర
- చూసేందుకు తరలి వచ్చిన జనం

సమ్మర్ స్టోరేజ్ నుంచి అస్పియా మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- పుంగనూరు

పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్ అజ్మతుల్లా కుమార్తె అస్పియా (7)గత నెల 29వ తేదీ సాయంత్రం ఏడు గంటల సమయంలో ఇంటిముందు ఆడుకుంటూ అదృశ్యమై బుధవారం శవమై కనిపించింది. చిన్నారి కోసం ఉబేదుల్లా కాంపౌండ్‌లోని యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెతికినా ఆచూకీ లేకపోవడంతో అదేరోజు రాత్రి పోలీసులు ఫిర్యాదు చేశారు. చిన్నారి మిస్సింగ్ మిస్టరీని జిల్లా ఎస్పీ సవాల్‌గా తీసుకుని మూడు రోజుల నుండి ముగ్గురు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 11 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించినా ఫలితం దక్కలేదు. చిన్నారి మిస్సింగ్ కేసు దర్యాప్తులో భాగంగా అనంతపురం రేంజ్ డీఐజీ షియుషి బాజ్ పేయ్ పుంగనూరుకు చేరుకుని చిన్నారి మిస్సింగ్‌పై ఎస్పీ, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గత మూడు రోజుల నుండి పుంగనూరు చెందిన యువకులు పోలీసు సిబ్బంది చిన్నారి ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ మూడు పర్యాయాలు, పోలీస్ బృందాలు నిశితంగా కేసు విషయంలో దర్యాప్తు చేపట్టినా ఎటువంటి ముందడుగు వేయలేకపోయారు. అయితే బుధవారం చిన్నారి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో శవమై కనిపించడంతో మరో మిస్టరీకి దారితీస్తోంది. చిన్నారిని ఎవరైనా హతమార్చి ఈ నీళ్లలో పారవేశారా అన్న కోణంలో పోలీసులు తదుపరి దర్యాప్తును కొనసాగించాల్సి ఉంది. చిన్నారి మృతి పట్ల పుంగనూరులో ప్రతి కుటుంబంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్దకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి చిన్నారి మృతదేహాన్ని చూసి ప్రతి ఒక్కరూ కంట కన్నీరు పెట్టారు.

చిన్నారి మృతదేహాన్ని చూడటానికి తరలి వచ్చిన జనం

పోస్టుమార్టం నివేదిక తర్వాతే దర్యాప్తు: ఎస్పీ

చిన్నారి అస్పియా మృతదేహం పోస్టుమార్టం అనంతరం వచ్చే ల్యాబ్ నివేదికలు ప్రకారం కేసు దర్యాప్తు చేపడతామని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. పుంగనూరు పట్టణంలో చిన్నారి 29న అదృశ్యమై బుధవారం శవమై సమ్మర్ స్టోరీస్ ట్యాంకులో తేలిందని, మృతదేహాన్ని ఎస్ఎస్ ట్యాంక్ నుండి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. చిన్నారి శరీరంపై ఎలాంటి గాయాలు కానీ లేవన్నారు. వైద్యులు పోస్టుమార్టం అనంతరం బాడీలోని కొన్ని అవయవాలను తీసి తిరుపతి ల్యాబ్‌కు పంపడం జరుగుతుందని, రిపోర్టర్ రావడానికి రెండు వారాలు పడుతుందని రిపోర్ట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేపడతామన్నారు. అప్పటివరకు ఎవరిపైన ఎలాంటి అనుమానాలు లేవని చెప్పారు.

ప్రసంగిస్తున్న విటపు బాలసుబ్రమణ్యం


ప్రపంచస్థాయి మేధావి ఏచూరి

సంస్మరణ సభలో విటపు బాలసుబ్రమణ్యం

ఏచూరికి నివాళి అర్పిస్తూ...

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

ప్రపంచస్థాయి మేధావి సీతారాం ఏచూరి అని మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షకుడుగా, బహుజనుల బాంధువుడుగా, సామ్యవాద స్వాప్నికుడుగా, ప్రజా సైనికుడుగా పనిచేసిన సీతారాం ఏచూరి మరణం తీరని లోటన్నారు. సూళ్లూరుపేట శేషసాయి కల్యాణ మండపంలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ సభకు సిపిఎం నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఔనత్యాన్ని వివరించారు. సిద్ధాంతకర్తగా ఆయన ఆలోచనలు అన్ని పార్టీలకు ఆమోదయోగ్యమే కాకుండా ఆచరణీయమన్నారు. ఈ సభలో తిరుపతి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, శ్రామిక మహిళా సంఘం అధ్యక్షులు లక్ష్మి, నాయకులు మోహన్‌రావు, పద్మనాభయ్య పాల్గొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమంతరెడ్డి, టౌడిపి టౌన్ అధ్యక్షులు ఆకుతోట రమేష్, సిపిఐ కార్యదర్శి సుధాకర్ కాళింగ్, ప్రభాకర్ రాజకీయాలకు అతీతంగా ఏచూరి సాధారణ జీవితాన్ని, సిద్ధాంతానికి కట్టుబడి ఉండటాన్ని ప్రశంసించారు.

స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే

ప్రభుత్వాలకు కాలం చెల్లినట్టే..

సీఐటీయూ, ఏఐటీయూసీ హెచ్చరిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐటియుసి, ప్రజాసంఘాల పిలుపు మేరకు బుధవారం దర్గాసర్కిల్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, నగర కార్యదర్శి దాసరి చంద్ర మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు, యువకులు ప్రాణత్యాగాలు చేసిన ఫలితంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని, ప్రత్యక్షంగా 40వేల మంది కార్మిక కుటుంబాలు, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. లాభాల్లో ఉన్న స్టీల్ ప్లాంట్‌ను కుంటి సాకులు చెప్పి ఆదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తే రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కాలం చెల్లినట్లే అని హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రమాదేవి, నాయకులు ప్రవీణ్ కుమార్, డిహెచ్‌పిఎస్ నాయకులు వి.దామోదరం పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఐక్య ఉపాధ్యాయఫెడరేషన్ స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకొని ఐరాల మండలం పొలకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. గత 50 సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యుటిఎఫ్ ఉద్యమాలు సాగిస్తున్నదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మణికండన్, నాయకులు మునిరత్నం, రాధాకృష్ణ, క్రిష్ణమూర్తి, పార్థసారధి, ఈశ్వరమహేంద్ర, ఏకాంబరం, ఎస్‌పి బాషా, అరుణశివప్రసాద్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాత్మకు ఘన నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పౌరుల భాగస్వామ్యంతోనే సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతి స్వచ్ఛతా హీ సేవలో భాగంగా గాంధీ విగ్రహ కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి కలెక్టర్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, నగర మేయర్ ఎస్.అముద, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఆర్డీఓ శ్రీనివాసులు పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ జయంతి పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రెండు వారాల పాటు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పరిసరాలతో పాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్లు శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కలెక్టర్ సహకారంతో చిత్తూరులో పీసీఆర్ కళాశాల, తాలూకా పోలీస్‌స్టేషన్ వంటి పాత భవనాలను పునర్ నిర్మించేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతా ప్రారంభించామని, చిత్తూరు అభివృద్ధికి తోడ్పాటుకు ముందుకు వచ్చే వారితో కలిసి ముందుకెళ్తామన్నారు. రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కటారి హేమలత, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

గాంధీజీ జయంతి సందర్భంగా చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి జిల్లా టిబీ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

ఫోటో: 2. గాంధీ విగ్రహానికి నివాళ్ళు అర్పిస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ.

విజయపురం: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గ్రామసభ నిర్వహించడం జరిగింది. సభలో ఉపాధి పనుల గుర్తింపు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, రోడ్ల మరమ్మత్తులపై చర్చించడం జరిగింది. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లోని వీధులు, మురుగునీటి కాలువను శుభ్రం చేశారు.

కార్వేటినగరం: గాంధీజీ జయంతి సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మండల పరిధిలోని 15 సచివాలయాల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లోను గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

సోమల: మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని శ్రీభారతి విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ షేక్ మహమ్మద్ అంజాద్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన సోమలలోని బస్టాండ్ కూడలిలో గల గాంధీ విగ్రహానికి ప్రజలు పూలమాలవేసి అంజలి ఘటించారు.

ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణధికారి కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఈవో గురు ప్రసాద్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ చిత్రపటానికి ప్రత్యేకపూజలు చేసి నివాళులు అర్పించారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్ బాబు, బాలరంగస్వామి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు గ్రామసచివాలయంలో గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. సర్పంచ్ నవనీతమ్మ, దామోదర రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, మండల కన్వీనర్ కార్తిక్, సర్పంచ్ వెంకటేష్, రాజన్న గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **గంగాధర నెల్లూరు:** ఎంపీడీవో కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీవో రాఘవేంద్ర రాజు, వైస్ ఎంపీపీ హరిబాబు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిరు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ మనోహర్ బాబు, స్వామి దాస్, జీవరత్నం, ఆర్ముగం, ఉలగనాథన్ పాల్గొన్నారు.

చిత్తూరులో.

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేంద్ర ప్రభుత్వం విధానాల వైఖరిని నిరసిస్తూ నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు. బుల్లెట్ రవి, బండ్ల సుబ్బరాయులు, గౌతమ్, చంద్రబాబు గౌడ్,పుష్పరాజు, జయచంద్రన్ పాల్గొన్నారు.

పలమనేరు: స్థానిక పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బాపూజీ ఉద్యావనంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పురపాలక సంఘంకు కేటాయించిన గల్ఫర్ మెషిన్ (సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ మెషిన్)ను ప్రారంభించారు. మహిళా సంఘ సభ్యులు తయారు చేసిన వస్తువులు ప్రదర్శించుటకు స్టాల్స్‌ను ఏర్పాటు చేసి మార్కెటింగ్ చేయడం జరిగినది.

రామకుప్పం: మండలంలో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. మండల టిడిపి అధ్యక్షులు ఆనంద రెడ్డి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక పథకాలతో అభివృద్ధి చెందాలన్నారు. సబ్సిడీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ పనిముట్లు, బ్యాంకు రుణాలతో చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, రాష్ట్రనేత మునస్వామి, నారాయణ చారి, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, రామ్మూర్తి, నందా రెడ్డి, సలాం, రఫీ, విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విజయవాడ వరదల్లో చిత్తూరు నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కొనియాడారు. మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా విజయవాడ వరదల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న నగరపాలక పారిశుధ్య కార్మికులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరదల సహాయ చర్యల్లో చిత్తూరు నగరపాలక సంస్థ నుంచి 70 మంది కార్మికులు, అధికారులు పాల్గొన్నారు. కార్మికులు ఎంతో శ్రమకోర్చి తక్కువ సమయంలోనే వార్డు మొత్తాన్ని శుభ్రం చేశారని, కార్మికులు సేవలు మర్చిపోలేనివని.. వారి సేవలను గుర్తించి వారికి చిరుసత్కారం చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు వీరు నగరపాలక కార్యాలయంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు..

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని పురపాలక పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు.

కార్మికులను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

మీ సేవలు చిరస్మరణీయం: ఎస్పీ

పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపండి.. మీ సేవలు చిరస్మరణీయం అని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. పోలీస్‌శాఖలో సేవలందించి పదవీ విరమణ పొందిన కుమార్, జగన్నాథరెడ్డిలను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాలపాటు అంకిత భావంతో అందించిన సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్పీ అన్నారు. పోలీసు డిపార్టుమెంటులో పనిచేయడం సవాల్‌తో కూడుకొన్నదని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసు శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన నాటి కాలంలో అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించడం మామూలు విషయం కాదన్నారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. పదవీ విరమణ తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో వివిధ రూపాలలో మోపిన విద్యుత్తు, ఇతరభారాలను తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ హామీకి భిన్నంగా విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పిపిసిఎ) 2022- 23 సంవత్సరానికి సుమారు రూ.8114 కోట్లు భారం వేయడం దారుణమని వెంటనే మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) నోటిఫికేషన్ జారీ చేసిందని, 2023 -24 సంవత్సరానికి సంబంధించి మరో 11 వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీల భారం మోపబోతున్నారని వార్తలు వస్తున్నాయని, మొత్తం దాదాపు 20వేల కోట్లు భారం విద్యుత్ వినియోగదారులు, రాష్ట్ర ప్రజలపై భారం పడబోతున్నదని అన్నారు. ఇప్పటికే వివిధ రకాల పేర్లతో విద్యుత్ చార్జీలు అధిక భారంగా ప్రజల భరిస్తున్నారని, వారికి ఉపశమనం కలిగించాల్సింది పోయి, ఇలాంటి అదనపు భారాలు మోపటం దారుణమన్నారు. తక్షణమే ఈ నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

'ఉచిత న్యాయసేవలు పొందండి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ ఈ.భీమారావు పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక పాత కలెక్టరేట్ వద్దగల సబ్ జైల్‌లో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ పద్మజ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, జైల్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖైదీలు జైల్‌లోకి వచ్చిన తర్వాత వారి సంక్షేమం మా బాధ్యత అని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఖైదీల వారి కుటుంబ సభ్యులకు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఖైదీల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తామని తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఖైదీలకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

చంద్రబాబు పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

ప్రజాశక్తి - తిరుపతి సిటి: శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి రెండు రోజుల పర్యటనకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతి రేణిగుంట విమానాశ్రయంలో ఇంటలిజెన్స్ అధికారులు ,తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్, డి ఆర్వో , విమానాశ్రయ అధికారులు, ఇతర శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తిరుపతి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమల వరుకు ముఖ్యమంత్రి పర్యటించు ప్రాంతాలను పరిశీలించారు తిరుమల టి.టి.డి ఉన్నతాధికారులతో కలసి తిరుమలలో పర్యటించు ప్రదేశాలలో క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి తిరుమల రాక సందర్భంగా తిరుపతి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుమల వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, అలాగే అప్ ఘాట్, డౌన్ ఘాట్ లోనూ స్పెషల్ పోలీస్ టీం లచే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించామన్నారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్‌ను నిర్వహించారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటా.. : ఎంపి

ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎంపి మిథున్ రెడ్డి

ప్రజాశక్తి -సదుం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దు అని, తాను అండగా ఉంటానని రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి అన్నారు. బుధవారం సదుం ఎంపిడిఓ కార్యాలయం సమావేశ మందిరంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపి మాట్లాడుతూ కార్యకర్తల సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడువక ముందే ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని, ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేదని అన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి, పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ అలీం బాషా, పులిచెర్ల ఎంపిపి సురేంద్ర రెడ్డి, పృథ్వీ రెడ్డి, చౌడేపల్లి జెడ్‌పిటిసి మోహన, నాగేశ్వరరావు, సదుం జెడ్‌పిటిసి సోమశేఖర్ రెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిపి ధనుంజయరెడ్డి, మండల అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, తిమ్మారెడ్డి, రమేష్‌ర ఎడ్డి సర్పంచులు ఉషారాణి, చల్లా శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో 'వారాహి' సభ

వెంగమాంబ నిత్యాన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - తిరుమల: ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11 రోజుల దీక్షను బుధవారం విరమించారు. కూతుర్లతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుమలకు వెళ్లిన ఆయన శ్రీవారి సమక్షంలో తాను చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షను విరమించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'ఇది కేవలం లడ్డూ కల్తీ గురించి కాదని, ప్రాయశ్చిత్త దీక్ష అనేది సనాతన ధర్మ రక్షణను ముందుకు తీసుకువెళ్లడానికి చాలా అవసరం' అన్నారు. ఇదిలా ఉండగా తిరుపతిలో తలెత్తిన సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాన్ని కోరుతూ, దానికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను బుధవారం ఆవిష్కరించబోతున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు. గురువారం జరిగే వారాహి సభలో పవన్ వారాహి డిక్లరేషన్ పుస్తకం లోని అంశాలను ప్రజలకు తెలియజేయనున్నట్లు

శ్రీవారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

సమాచారం. పవన్ చేతిలో ఉన్న రెడ్ కలర్‌లో ఉన్న ఆ బుక్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఆ బుక్ కవర్ పేజీపైన ధర్మో రక్షతి రక్షిత్త అని రాసి ఉంది. దాని కింద వారాహి అమ్మవారి చిత్రం కూడా ఉంది. అయితే ఆ బుక్ లో ఏముందని చర్చించుకుంటున్నారు. నేడు తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో వారాహి బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఇక్కడే పుస్తకంలోని అంశాలను పవన్ స్వయంగా వెల్లడిస్తారని సమాచారం. ఎంఎల్‌సి పిడుగు హరిప్రసాద్, తిరుపతి రైల్వేకోడూరు శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, అరవా శ్రీధర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ఉన్నారు.

రేపే శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భ చాప, తాడును టిటిడి అటవీ విభాగం కార్యాలయం నుండి బుధవారం డిఎఫ్‌వో శ్రీనివాసులు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు.అనంతరం శ్రీవారి ఆలయం రంగనాయకుల మండపంలోని శేషవాహనంపై దర్భతో తయారుచేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 4వ తేదీ జరిగే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు.

ధ్వజారోహణానికి దర్భ చాప, తాడు కీలకం

బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభంపైకి గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. రుత్వికులు వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టిటిడి అటవీ శాఖ 10 రోజుల ముందునుంచే కసరత్తు చేస్తోంది. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భను ఉపయోగిస్తారు. ఇందుకోసం ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో విష్ణుదర్భను టిటిడి అటవీ సిబ్బంది సేకరించారు. దీన్ని తిరుమలకు తెచ్చి తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెట్టి బాగా శుభ్రపరచి, చాప, తాడు తయారు చేశారు. అటవీశాఖ సిబ్బంది 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో దర్భ చాప, 225 మీటర్ల పొడవు తాడు సిద్ధం చేశారు. రేంజ్ అధికారి రమణారెడ్డి, శ్రీనివాసులు, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని శ్రీ కామాక్షి సమేత మొగులేశ్వర స్వామి ఆలయం లో బుధవారం కరణం సంక్షేమ సంఘం సభ్యులు మహాలయ పక్ష అమావాస్య పురస్కరించుకొని అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం సలహాదారు షణ్ముగ పిల్లై, కార్యదర్శి రవీంద్ర ప్రసాద్, ఉప కార్యదర్శులు శంకరన్, హరిహర ప్రసాద్, సభ్యులు రవి చంద్ర, గురునాథం, రామయ్య పిల్లై, రేవంత్ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని కందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు దస్తగిరి బాబా, తనీష్ ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయులు చిన్నబ్బ తెలిపారు. బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. గంగవరం మండల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 1న జరిగిన అండర్ 17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. కాగా వారిని పాఠశాల హెచ్ఎం వెంకటరమణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

'నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం'

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలో వెలసిన ఆరిమాని గంగమ్మ ఉత్సవాలను విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలయ ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. బుధవారం వారు ఆలయం వద్ద సమావేశమై విధివిధానాలు చర్చించారు. ఉత్సవాలకు కావలసిన ఏర్పాట్లును నిర్ణయించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లుపై సమీక్షించారు. కార్యక్రమంలో హిమాచలపతి రెడ్డి, సిద్దయ్య శెట్టి, కరణం జయచంద్ర నాయుడు, హేమాద్రి యాదవ్, యార్వ మునిరెడ్డి, జలంధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: నూతన మద్యం షాపులకు కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయం లో దరఖాస్తులను అందించాలని ఇన్‌ఛార్జ్ సీఐ సత్యనారాయణ బుధవారం ఒక ప్రక టనలో పేర్కొన్నారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలో కార్వేటినగరం మండలంలో 3, శ్రీరంగరాజపురంలో 2, వెదురు కుప్పంలో 2, పాలసముద్రంలో 1 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ దరఖాస్తులు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్ లైన్‌లో గాని దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుదారులు రూ.2లక్షలు డిపాజిట్ కట్టాల్సి ఉంటుందని తెలిపారు. మద్యం షాపు వచ్చిన వారు మొదటి సంవత్సరం రూ.55లక్షలు, రెండవ సంవత్సరం రూ.60.50లక్షలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440360014 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రాథమిక పాఠశాల వరండాలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రం

ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే..

- అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- సొంత భవనాల్లేక పాఠశాల వరండాలోనే కాలం వెల్లదీస్తున్న వైనం
- పట్టించుకొనేవారు కరువైయ్యారని వెల్లువెత్తుతున్న విమర్శలు

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నింద్ర మండలంలో సొంత భవనాలు లేక అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. అరకొర సౌకర్యాల నడుమ పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వరండా, అద్దె ఇండ్లలో అంగన్వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. మండలంలో 18మిని, 37మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు నిర్వహణలో ఉండగా అందులో 35కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. దాదాపు 531మంది చిన్నారులు ఆయా చోట్ల కేంద్రాలకు వస్తున్నారు.

సౌకర్యాలు అంతంత మాత్రమే..

అద్దె భవనాల్లో కూడా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని చోట్ల నిరుపయోగంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. అక్కడ వర్షాలు కురిసినప్పుడు ఉరుస్తుండటంతో సెలవులు ప్రకటిస్తున్నారు. వేసవి కాలంలో ఎండ తీవ్రతకు, ఉక్కపోతకు పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్లు అక్కడి స్థానికులు చెబుతున్నారు. కనీసం ఫ్యాన్ సౌకర్యం కూడా లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. మధ్యాహ్నం పూట పిల్లలు విశాంత్రి తీసుకోవడం కోసం సరైన వసతులు లేకపోవడంతో పిల్లలు తమ ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

పక్కా భవనాల నిర్మాణమెప్పుడో..

అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో కాలం వెల్లదీస్తున్న పరిస్థితి. పక్కా భవనాలు నిర్మించి పిల్లలు సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు. కానీస వసతులు లేక పిల్లల హాజరు సంఖ్య తగ్గుతోందని, ఆ మేరకు అధికారులు చొరవ తీసుకొని పక్కా భవనాలను నిర్మించాలని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం అద్దె భవనాలు, పాఠశాలల్లో నడుస్తున్న చోట మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుకుంటున్నారు.

కోరిన వారందరికీ ఉపాధి పనులు

- గ్రామ సభలో ఏపీడీ శోభన్ బాబు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కోరిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తామని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు అన్నారు. బుధవారం కార్వేటినగరంలో సర్పంచ్ ధనుంజయవర్మ అధ్యక్షతన గ్రామ సభను ఎంపిపి లతబాలాజీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ పల్లెల్లో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రతి కూలీలకు పనులు కనిపించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ లక్ష్మీపతి అన్నారు. టిడిపి నాయకుడు రవి యాదవ్ మాట్లాడుతూ స్థానిక ఆలయం నుంచి డ్రైనేజ్ కాలువలు నిర్మించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా పద్మ సరస్సు జగనన్న కాలనీలో నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయలేదని ఉద్యోగులకు, అనర్హులకు మంజూరు చేశారని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎంపీడీవోని కోరారు. ఉపాధి కూలీలకు పనులు గుర్తించి వాటిని కూలీలకు అప్పగిస్తామని ఏపీఓ జాహ్నవి అన్నారు. అనంతరం ఎంపీపీ లతబాలాజీ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. చెత్తాచెదారం లేకుండా అందరూ కలిసిమెలిసి మండలాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ ధనంజయ వర్మ మాట్లాడుతూ రోడ్డుపైన చెత్తను వేయకుండా తమ ఇంటి వద్ద చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు అందులో వేయాలన్నారు. కార్యక్రమంలో ఏటీఎం కవిత, హౌసింగ్ ఎఈ రాఘవయ్య, ఈవో మణి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభలలో ప్రసంగిస్తున్న ఏపీడీ శోభన్ బాబు

నారా లోకేష్‌ను కలిసిన టిడిపి యువనేత

ప్రజాశక్తి-రామకుప్పం: మంత్రి నారా లోకేష్‌ను మండల టిడిపి యువనేత నవీన్ బుధవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బ్లడ్ డోనర్స్ గురించి ఆయనకు వివరించారు. నిరుపేదలకు సకాలంలో బ్లడ్ అందించేందుకు తమ టీం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయనకు వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి ముందు పరస్పర సహకారం అందిస్తామని తెలిపారు.

నారా లోకేష్‌తో యువనేత నవీన్

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- మెప్మా అర్బన్ మార్కెట్‌లతో నాణ్యమైన వస్తువులు
- పొదుపు సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తోడ్పాటు
- మార్కెట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి-పలమనేరు: మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం పలమనేరు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో జరిగిన మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. మహిళా సంఘ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను మార్కెటింగ్ సౌకర్యం, విక్రయించే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం మెప్మా బజార్లను నిర్వహిస్తోందన్నారు. పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాలను ఇప్పించడమే కాకుండా వారు ఇతరులపై ఆధారపడకుండా ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే మహిళ అర్బన్ మార్కెట్లను ఏర్పాటు చేసి నాణ్యమైన వస్తువులను అందుబాటులోకి తేవడం, మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు విక్రయించే అవకాశాన్ని కూడా కల్పించడం జరుగుతుందన్నారు. చేతి వృత్తులు కుటీర పరిశ్రమల ద్వారా తయారు చేసే ఉత్పత్తులను పట్టణవాసులు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని సూచించారు. పొదుపు సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని మహిళలు మగవాళ్ళకు ధీటుగా ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. తదనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఆయన సన్మానించారు. కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మెప్మా సీఎంఎం వి.బాబా, సీఈవోలు జయంతి, ధనలక్ష్మి, ఎస్ఎల్ఎఫ్, ఆర్పీలు, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ, నాయకులు కుట్టి, గిరి, సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు, ఖాజా, కిరణ్, బిఆర్‌సి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమల ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గ్రామీణ విద్యార్థుల అభివృద్ధే లక్ష్యం

అమర రాజా సంస్థల అధినేత గల్లా రామచంద్ర నాయుడు

ప్రజాశక్తి-పూతలపట్టు: గ్రామీణ విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా తోడ్పాటు అందిస్తామని అమర రాజా సంస్థల అధినేత గల్లా రామచంద్ర నాయుడు అన్నారు. మండలంలోని పేట మిట్ట గ్రామంలోని మంగళ్ విద్యాలయం పాఠశాలలో బుధవారం 49వ శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ కలిగిన ఎంతోమంది పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తమ వంతు సహాయ సహకారాలు అందించాలనే నెపంతో పాటూరి రాజగోపాల్ నాయుడు స్ఫూర్తితో శ్రీకృష్ణదేవరాయ విద్యాసాంస్కృతిక సంఘాన్ని స్థాపించామన్నారు. అందులో ఎంతో మంది దాతలను భాగస్వాములుగా చేసి, పదవ తరగతిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు, ఇంటర్, డిగ్రీ, బీటెక్, సిఏ మొదలైన కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 200మంది విద్యార్థులకు రూ.40లక్షల ఉపకార వేతనాలను అందించడం జరిగిందన్నారు. అనంతరం మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ ఇటీవల తాను రాసిన స్వీయ చరిత్ర పుస్తక ఆవిష్కరణ జరిగిందన్నారు. ఆ పుస్తకం మొదటి ముద్రణలోని 5000 పుస్తకాలు అమ్ముడైనట్లు వివరించారు. ఆ పుస్తకాల ద్వారా వచ్చిన నగదు రూ.50లక్షలను పేద విద్యార్థుల చదువుకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆ మొత్తాన్ని ట్రస్టుకు విరాళంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఆ సొమ్ము ఐదువేల మంది చేతుల ద్వారా విరాళంగా అందించారని ఇందులో సీఎం చంద్రబాబు డబ్బులు కూడా ఉన్నట్టు తెలిపారు.

విరాళపు చెక్కును అందిస్తున్న గల్లా అరుణకుమారి

ముగిసిన ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రజాశక్తి-సోమల: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని 15పంచాయతీలలో ఉపాధి హామీ ఆధ్వర్యంలో గ్రామ సభలను సచివాలయాల వద్ద బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామసభలలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులకు గుర్తింపు, అభివృద్ధి ప్రణాళికలపై రైతులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాలలో ఉపాధి ఏపీఓ దినకర్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌లకు సన్మానం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పలు పంచాయతీలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి వారికి దుస్తుల పంపిణీ చేశారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను ఇకపై పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రీన్ అంబాసిడర్లకు సలహాలు ఇచ్చారు.

మానవత్వం చాటుకున్న డిజిటల్ అసిస్టెంట్

- బెంగళూరుకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేత

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లి గ్రామానికి చెందిన భాస్కర నాయుడు అనారోగ్య కారణాలతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన అక్కడే బంధువుల ఇంటిలో ఉండగా వృద్ధాప్య పింఛన్ అందించేందుకు సచివాలయానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ రాజశేఖర్ నేరుగా బెంగళూరుకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందజేశారు. దీంతో రాజశేఖర్‌ను పంచాయతీ కార్యదర్శి లలిత కుమారి అభినందించారు.

లబ్ధిదారునికి పింఛన్ అందిస్తున్న రాజశేఖర్

సామాజిక విలువల పెంపులో పెద్దలది కీలక పాత్ర : లక్ష్మి

ప్రజాశక్తి - క్యాంపస్ : సమాజంలో చిన్నపిల్లల్లో విలువలను పెంపొందిం చడంలో పెద్దలు కీలక పాత్ర పోషిస్తారని డిస్టిక్ కో ఆపరేటివ్ ఆఫీసర్ లక్ష్మి పేర్కొన్నారు. ఎస్వియులోని గృహ విజ్ఞాన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవం వర్సిటీ నర్సరీ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో చిన్న పిల్లలలో నైతిక, మానసిక, సాంఘిక విలువలను పెంపొందించడంలో వయోవృద్ధులు ఎంతో కీలకంగా వ్యవహరిస్తారన్నారు. ఆచార్య కె అనురాధ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం వల్ల చిన్న పిల్లల్లో నైతిక, సామాజిక అంశాల గురించి వారికి వివరించేవారు కరువయ్యారన్నారు. కుటుంబంలో పెద్దవారు ఉండడం ద్వారా చిన్నపిల్లలలో మానసిక, నైతిక, సాంఘిక విషయాలలో మన వైఖరుల పట్ల పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించే అవకాశం వుందన్నారు. స్కూల్లోని వివిధ ప్రత్యేకతలు, ఆధునిక సౌకర్యాల గురించి వివరించారు. దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి, ఆవశ్యకత గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు చక్కగా వివరించారు. నర్సరీ పాఠశాలలో వయో వృద్ధులకు ఆటల, పోటీలు నిర్వహించి వారిలో ఆనందం కలిగించారు. ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రం విభాగాధిపతి ఆచార్య కోలా మంజుల, డాక్టర్ బి స్వరూప రాణి, ఆచార్య సుచరిత, నర్సరీ స్కూల్ టీచర్లు డాక్టర్ సుదర్శనమ్మ, రాధిక, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల దినోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు

ఏపీలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ సదస్సులో వక్తలు

నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరిస్తున్న అతిథులు, వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల భూమి తగాదాల పరిష్కారానికి, పెండింగ్‌లో వున్న ఆపరిష్కృతమైన కేసుల పరిష్కారానికి సుప్రీం కోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సెనేట్ హాల్ లో ఎన్ఎస్ఎల్ఏ వ్యవస్థాపక అధ్యక్షులు సుందరరాజు, మోహన్ అధ్యక్షతన 'దక్షిణాది ప్రాంతంలో సుప్రీంకోర్టు బెంచ్ అవసరం.. దాని ఆవశ్యకత' అనే అంశంపై సదస్సు, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్ వినోద్ కుమార్, బిజెపి రాష్ట్ర స్పోక్ పర్సన్ జి భాను ప్రకాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ న్యాయ వ్యవస్థ మౌలిక సూత్రం, సుపరిపాలన, సామాజిక న్యాయం, సమాజ అని రంగాల్లో భారత పౌరులందరికీ జనాభా దామాషా పద్ధతిన పంపిణీ న్యాయం జరగాలన్నారు. లా కమిషన్ రిపోర్ట్ 2009 లో సుప్రీంకోర్టు బెంచీలు దక్షిణాదిలో చెన్నై, హైదరాబాద్, ఉత్తరాదిలో ఢిల్లీ, తూర్పున కలకత్తా, పశ్చిమాన ముంబైలో ఏర్పాటు చేయాలని సూచించినా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. గతంలో వచ్చిన కమిషన్లను ప్రభుత్వం తక్షణమే సౌత్ ఇండియాలో సుప్రీంకోర్టు బెంచ్‌ని ఏర్పాటు చేయడం సామాన్య ప్రజలకు న్యాయం జరగడానికి సాధ్యపడుతుందని వారు పేర్కొన్నారు. జి భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణాదిలో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ని స్వాగతిస్తూ తాను భవిష్యత్తులో ప్రధానమంత్రి మోడీ, అమిత్ షాలతో మాట్లాడి సుప్రీంకోర్టు బెంచ్ సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుప్రీంకోర్టు బెంచ్ దక్షిణాది లో ఏర్పాటు చేసేందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డితో మాట్లాడి అసెంబ్లీ సమావేశాలలో ఈ విషయం డిమాండ్ గురించి ప్రస్తావించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ బైక్ ఢీ

- ఇద్దరి పరిస్థితి విషమం

ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యుగంధర్, గిరి రాజా

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: లారీ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బైరెడ్డిపల్లి-పుంగనూరు జాతీయ రహదారిలోని చెల్లారుగుంట క్రాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..పుంగనూరు వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఆకుల కొత్తూరు గ్రామానికి చెందిన యుగంధర్ గౌడ్, చలగానిపల్లికి చెందిన గిరి రాజా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే 108ద్వారా కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన బుధవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎస్ఆర్ పురం మండలానికి చెందిన నాగమ్మ (68) చిత్తూరు కొండారెడ్డిపల్లి అన్న క్యాంటీన్ వద్ద రోడ్డు దాటుతుండగా చిత్తూరు వైపుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగమ్మను 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వృద్ధురాలు మృతి చెందినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న వన్ టౌన్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎస్కే ఆర్ డిగ్రీ కళాశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను మోటార్ బైక్ అదుపు తప్పి ఢీ కొంది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు పెను ముప్పు తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు వాహనం స్వల్పంగా తగలడంతో పెనుముప్పు తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్వల్పంగా గాయపడ్డ వారిని స్థానికుల సాయంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు ఓ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

వెదురుకుప్పం ప్రాథమిక పాఠశాల

అస్తవ్యస్తంగా మారిన మరుగుదొడ్డి

అరకొర వసతులు తప్పని అగచాట్లు

- మరుగుదొడ్ల నిర్వహణ లేక విద్యార్థులకు అవస్థలు
- మౌలిక వసతుల కల్పనలో అదే నిర్లక్ష్యం
- బడుల్లో అస్తవ్యస్తంగా పిల్లల పరిస్థితి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రభుత్వ బడుల్లో తగినన్ని మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అరకొర వసతులతో కాలం వెల్లదీస్తున్న పరిస్థితి దాపరించింది. కనీసం మరుగుదొడ్ల నిర్వహణ లేక ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలల్లో కనీస నీటి సౌకర్యం కూడా లేని దుస్థితి ఏర్పడింది. ఆరుబయటనే మూత్ర విసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితి. ఎవరినడగాలో.. ఎవరితో చెప్పాలో కూడా తెలియని చిన్నతనంలో ఆ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఓ సామాజిక వేత్త ఇటీవల నిర్వహించిన సర్వేలో నిజాలు వెలుగుచూశాయి. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన తెలుసుకున్నట్లు చెప్పారు.

30కిపైగా పాఠశాలల్లో ఇదే పరిస్థితి..

వెదురుకుప్పం మండలంలోని 30కు పైగా పాఠశాలలో అరకొర సదుపాయాలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది. కనీసం నీటి సౌకర్యం కూడా లేకపోయింది. మరుగుదొడ్ల నిర్వహణ లేక, పట్టించుకొనే వారు లేక పాఠశాల పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా గొడుగుచింత, సద్దికూళ్లపల్లి, ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలల్లో పూర్తిగా మరుగుదొడ్ల సౌకర్యం లేదు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

మండలంలో మొత్తం
పాఠశాలలు 81
ప్రాథమిక పాఠశాలలు 68
ప్రాథమికోన్నత పాఠశాలలు 4
ఉన్నత పాఠశాలలు 9
విద్యార్థుల సంఖ్య 2871

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించి మెరుగైన విద్యాను అందించాలి. మరుగుదొడ్ల అందుబాటులోకి తీసుకురావాలి. నీటి సౌకర్యం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. విద్యాభివృద్ధికి పాలకులు పార్టీలకతీతంగా పనిచేయాలి.
- వాసుదేవ రెడ్డి, పచ్చికాపల్లం, వెదురుకుప్పం మండలం

జిల్లా అధికారులకు నివేదిక పంపించాం..

వివిధ పాఠశాలల్లో మరుగుదొడ్ల లేని మాట వాస్తవమే. నాడు-నేడు ద్వారా చాలా వరకు పాఠశాలల్లో మరమ్మతులు జరిగాయి. విద్యార్థులకు ఇబ్బంది ఉన్న చోట మరమ్మతులు, నూతన మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సౌకర్యం ఏర్పాటుకు సంబంధించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.
- మహేశ్వర రాజు, ఎంఈవో, వెదురుకుప్పం మండలం